ప్రజాశక్తి

శనివారం 22 ఫిబ్రవరి 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ప్రచారం ఉధృతం

- ఎమ్మెల్సీ ఎన్నికలకు మూడ్రోజుల్లో ముగియనున్న గడువు
- ఉద్యమ అభ్యర్థిగా కెఎస్ లక్ష్మణరావుకు పెరుగుతున్న విశాల మద్దతు
- సర్వశక్తులూ ఒడ్డుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్



రెండ్రోజుల కిందట సత్తెనపల్లిలో ప్రచారంలో పాల్గొన్న పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27న జరగనుంది. మరో మూడ్రోజుల్లో ఎన్నికల ప్రచారం ముగియనుండడంతో అభ్యర్థులు తమ ప్రచారాన్ని ఉధృతం చేయడంతోపాటు ఇంటింటి ప్రచారంపై దృష్టి సారించారు.

ఈ ఎన్నికల్లో రెండు జిల్లాల పరిధిలో 33 నియోజకవర్గాల్లో 3,47,116 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలకు సంబంధించి మొత్తం 483 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లలో తలమునకలై ఉండగా ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. విస్తీర్ణం ఎక్కువగా ఉండటం వల్ల అభ్యర్థులు నేరుగా ఎక్కువ మంది ఓటర్లను కలవలేకపోతున్నారు. దీంతో వారి అనుచరుల ద్వారా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి తమ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరుతున్నారు.

ఎన్నికల్లో 25 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా పధాన పోటీ పిడిఎఫ్ అభ్యర్థి అయిన సిట్టింగ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, టిడిపి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మధ్య నెలకొంది. 14 ఏళ్లు ఎమ్మెల్సీగా పనిచేస్తున్న లక్ష్మణరావు వివాదాలకు దూరంగా ఉంటూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారని, పలు సమస్యలపై శాసన మండలిలో ప్రస్తావిచండంతోపాటు ప్రత్యక్ష ఉద్యమాల్లోనూ పాల్గొంటారని పేరుంది. అంతేగాక నిజాయితీగా పనిచేయడం, వివిధ తరగతుల ప్రజా సమస్యలపై వివిధ వేదికలపై స్పందించడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం వల్ల ప్రజలతో ఉన్న సత్సంబంధాలు లక్ష్మణరావుకు కలిసి వచ్చే అంశంగా చెబుతున్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు కార్పొరేట్ సంస్థల నిర్వాహకుడిగా అర్థబలంతోపాటు అధికార పార్టీ అండతో అంగబలం ఎక్కువగా ఉన్నా కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగుల్లో నెలకొన్న అసంతృప్తితో ప్రతికూలతను ఎదుర్కొంటున్నారు. అయినా ఆర్థిక, అంగ బలాలతో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

మొత్తం 33 నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, మంత్రులు, పలువురు సీనియర్ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టి సారించారు. తనకు మద్దతిస్తున్న వివిధ సంఘాల నాయకులు, సంఘాల సభ్యులు కూడా ఓటర్లను కలిసి తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయాలని లక్ష్మణరావు కోరుతున్నారు. ఆయనకు ఇప్పటికే వివిధ ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, నిరుద్యోగులు మద్దతు ప్రకటించారు. వీరితోపాటు రైతులు, కౌలు రైతులు, చేనేత కార్మికులు, స్కీం వర్కర్లు ఇలా అనేక రంగాలకు చెందిన వారి సమస్యల పరిష్కారం కోసం లక్ష్మణరావు కృషి వల్ల ఆయా తరగతుల ఓటర్లలో సానుకూలత ఏర్పడింది. నిరుద్యోగులకు జాబ్ కేలండర్ ఇవ్వడంలో ▶ 2లో



విలేకర్లతో మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు

క్వింటాళ్ మిర్చికి రూ.20 వేల ధరివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెదనందిపాడు

ఎన్నో కష్టనష్టాలకోర్చి పండించిన మిర్చికి ధరలు పతనమవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, ఈ నేపథ్యంలో క్వింటాళ్‌కు రూ.20 వేలు ధర ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. పెదనందిపాడుకు శుక్రవారం వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో రూ.18 వేల వరకు ఉన్న సాధారణ రకం మిర్చి ప్రస్తుతం రూ.10 వేలే ఉందని, పంట చేతికొచ్చేసరికి ధరలు పడిపోవడం దారుణమని అన్నారు. గుంటూరు మిర్చియార్డులో వ్యాపారులు నిబంధన పేరుతో ఉన్న రేటు కంటే తగ్గిస్తున్నట్లు రైతులు చెబుతున్నారని, దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు కలుగజేసుకుని వ్యాపారులను నియంత్రించాలని కోరారు. అధికార, ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు విమర్శలు మానుకొని, రైతులను న్యాయం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచబోమని, భారాలు ▶ 2లో



ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రచారం చేస్తున్న నాయకులు

లక్ష్మణరావుకు మద్దతుగా ఎస్‌పిఎన్‌టిఒ ప్రచారం

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో అధ్యాపక, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్, యువజన, నిరుద్యోగులు తదితర సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌పిఎల్‌టిఒ) నాయకులు శుక్రవారం గుంటూరు నగరంలో విస్తృత ప్రచారం చేశారు. వివిధ స్కూల్స్‌లో ఉపాధ్యాయుల్ని కలిసి లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటేయాలని కోరారు. రాజకీయాలతో నిమిత్తం లేకుండా అందరి సమస్యలపై పనిచేసే లక్ష్మణరావును ప్రతి ఒక్కరూ ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని రంగాలపై సమగ్ర అవగాహనతో పనిచేస్తారని, ప్రజా సమస్యలే తన ఊపిరిగా భావించిన గొప్ప సామాజిక వేత్త కెఎస్ లక్ష్మణరావు అని అన్నారు. లక్ష్మణరావుకు ఎస్‌పిఎల్‌టిఒ పూర్తి మద్దతు ప్రకటించడమే కాకుండా ఆయన విజయానికి కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ పయర్ల నాగయ్య, రాష్ట్ర కాలేజీ సంఘం అధ్యక్షులు కావూరి గోవిందరాజులు, సెక్రెటరీ ఎం.రాకేష్, కొండపల్లి విల్సన్ పాల్గొన్నారు.



ప్రమాదానికి గురైన వాహనం వద్ద వలస కూలీలు

వలస కూలీల వాహనం బోల్తా

ప్రజాశక్తి- మేడికొండూరు

వలస కూలీలతో వెళుతున్న మినీలారీ బోల్తాపడి ఆరుగురికి గాయాలైన ఘటన మండలంలోని సత్తెనపల్లి రోడ్డు గుళ్లపాలెం సమీపంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపాడుకు చెందిన 25 మంది కూలీలు గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కోవెలమూడికి వెళ్తున్నారు. గొల్లపాలెం హెచ్‌పి పెట్రోల్ బంక్ వద్దకు రాగానే కూలీల వాహనం అదుపు తప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. రాజ్‌కుమార్, చంద్రమ్మకు తీవ్ర గాయాలు కాగా మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. హైదరాబాద్, గుంటూరుకు మార్గమైన ఈ దారిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. అందుకే కొండమోడు వరకూ రోడ్డు విస్తరణ కూడా చేపట్టారు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఇతర వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

గుంటూరులో బ్యాంకు ఉద్యోగులు నిరసన

8 లో



చికెన్, గుడ్డు మేళాకు భారీగా హాజరైన జనం

8 లో

చికెన్, గుడ్డు వినియోగంపై అపోహలు వద్దు

అవగాహన సదస్సులో ప్రజాప్రతినిధులు, అసోసియేషన్ ప్రతినిధులు

భారత భాగ్య విధాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

భారతదేశానికి దశా, దిశా చూపిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావిగా కీర్తించబడుతున్నారని తద్వారా భారత భాగ్య విధాతగా ఆయనను నేటి సమాజం కొనియాడుతుందని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య గంటా చక్రపాణి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ విజన్ ఇంటర్ ప్లే ఆఫ్ సోషియో, పొలిటికల్, ఎకనామిక్ ఫ్యాక్టర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సు ప్రారంభమైంది. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం. సురేష్ కుమార్ అధ్యక్షతన సదస్సులో ఆచార్య గంటా చక్రపాణి మాట్లాడారు. నేడు ప్రపంచ దేశాలన్నీ ఆర్థికంగా గాని, సామాజికంగా గాని, రాజకీయంగా గాని పతనావస్థకు చేరుకున్న సంఘటనలు మనం నిరంతరం చూస్తూనే ఉన్నామన్నారు. కానీ భారతదేశం అటువంటి సంక్షోభాలకు దూరంగా ఉందని , దీనికి ప్రధాన కారణం ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే అన్నారు. రాజ్యాంగానికి ఎక్స్పైరీ డేట్ ఉండదని అందులో సవరణలు మాత్రమే ఉంటాయని గుర్తు చేశారు. అంబేద్కర్ ఆలోచన విధానాలను ముందుకు తీసుకెళుతున్న అంబేద్కర్ చైర్ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. భారత దేశంలో అంబేద్కర్ ఐడియాలజిని ముందుకు తీసుకు వెళ్ళేందుకు భారత ప్రభుత్వం ఇటువంటి అధ్యయన కేంద్రాల ద్వారా అందరికీ అంబేద్కర్ ఆశయాలు తెలియచెప్తుందని వివరించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ విలువలు మణిపూర్ ఘటనలు ఎన్ని జరిగిన న్యాయవ్యవస్థ దానిని అడ్డుకున్నట్లు గుర్తు చేశారు. భారతదేశంలో ఆయన చిన్నతనం నుంచి ఎదుర్కొన్న కుల వివక్ష, సామాజిక అన్యాయం, అసమానతలు, అంటరానితనం వంటివి క్షుణ్ణంగా అధ్యయనం చేసి భారత రాజ్యాంగానికి ఒక మార్గాన్ని చూపారని వివరించారు. ప్రపంచంలో ఉన్న మూడు ప్రఖ్యాత సంస్థలు అంబేద్కర్ ను విజ్ఞాన భాండాగారంగా అభివర్ణించాయని గుర్తు చేశారు. ఆయన అమెరికాలో ఉన్నప్పుడు నల్లజాతీయులు స్వేచ్ఛ కోసం చేసిన పోరాటాన్ని పూర్తిగా అధ్యయనం చేశాడన్నారు. అలాగే ఫ్రెంచ్ విప్లవం, బౌద్ధం నుంచి సేకరించిన సంఘటనల సమూహారంగా రాజ్యాంగాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. ఆయన చదువుకునే రోజుల్లోనే భారత దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలను క్షుణ్ణంగా అధ్యయం చేసే విద్యను అభ్యసించి ఆ రోజుల్లోనే ప్రాబ్లం ఆఫ్ రూపీ అనే పుస్తకాన్ని రాసి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటుకు మార్గం చూపారని అన్నారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసి ఆచార్య గంటా చక్రపాణి



డాక్టర్ అంబేద్కర్ న్యాయశాఖ మంత్రిగా పనిచేస్తున్న రోజుల్లో అనేక చట్టాలను తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. సామాజికంగా ప్రతి ఒక్కరు సమానత్వం కలిగి ఉండాలని ఆకాంక్షించి అందరికీ సమానత్వం చూపేలా ఓటు హక్కు కల్పించిన ఘనత అంబేద్కర్‌కు దక్కుతుందన్నారు. ఆయన ఆశించిన సమానత్వాన్ని దేశంలో అమలు జరిగేలా నేటి యువత చొరవ చూపాల్సిన బాధ్యతను తీసుకోవాలని గంటా చక్రపాణి పిలుపునిచ్చారు. విసి ఆచార్య కే. గంగాధరరావు మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ప్రతి ఒక్కరు సమానత్వం సాధించినపుడే భారత రాజ్యాంగానికి విలువ ఉంటుందని అన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న రెక్టర్ ఆచార్య కె.రత్న షీలా మణి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి .సింహాచలం, అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్, సెమినార్ డైరెక్టర్ ఆచార్య వై.అశోక్ కుమార్, సెమినార్ కోశాధికారి డాక్టర్ కే. అబ్రహం లింకన్, అంబేద్కర్ చైర్ పూర్వ విభాగాధిపతి ఆచార్య నాలాది శామ్యూల్, గాంధీ అధ్యయన కేంద్రం పూర్వ సంచాలకులు డాక్టర్ కే సోమశేఖర్, ఆర్ట్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపల్ ఆచార్య చల్లపల్లి స్వరూప రాణి, నూటా అధ్యక్షుడు డాక్టర్ బట్టు నాగరాజు పాల్గొన్నారు.

1 నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మార్చి 1 నుండి సింగిల్ యూజ్ ప్లాసిక్ వినియోగం, విక్రయంపై సంపూర్ణ నిషేధం అమలులో ఉంటుందని, ప్రజారోగ్య రక్షణ దష్ట్యా నగర ప్రజలు, వ్యాపార సంస్థలు నిషేధంపై నగరపాలక సంస్థకు సహకరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ (అమెండ్మెంట్ రూల్స్) 2021 ప్రకారం 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కల్గిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, నాన్ ఓవెన్ ప్లాస్టిక్ బ్యాగ్స్ (చదరపు మీటర్‌కి 60 గ్రాముల కన్నా తక్కువ బరువు) ఉత్పత్తి, నిల్వ చేయటం, వినియోగం, విక్రయాలను కేంద్ర పర్యావరణ శాఖ నిషేధించిందన్నారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని కూడా నిషేధించడం జరిగిందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ ఇయర్ బడ్స్, ప్లాస్టిక్ స్టిక్స్ ఉన్న బెలూన్లు, ప్లాస్టిక్ జెండాలు, క్యాండీ స్టిక్స్, ఐస్ క్రీమ్ స్టిక్స్, అలంకరణ కోసం వినియోగించే థర్మాకోల్, ప్లాస్టిక్ ప్లేట్స్, కప్స్, గ్లాసులు, ఫోర్క్, స్పూన్లు, కత్తులు, స్ట్రాలు, ట్రేలు, స్వీట్ బాక్సుల్లో ప్యాకింగ్, ప్లాస్టిక్ ఇన్విటేషన్ కార్డులు, సిగరెట్ ప్యాకెట్స్, 100 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ఫ్లెక్సీ బ్యానర్లు, స్టిరర్స్ వంటి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధం అమలులో ఉంటుందన్నారు. కావున ప్రజలు సహకరించాలని కోరారు.

మాట్లాడుతున్న జెఎస్ఆర్కె ప్రసాద్



వినూత్న ఆవిష్కరణలు రూపొందించాలి

ప్రజాశక్తి-గుంటూరు

వినూత్న ఆవిష్కరణల దిశగా విద్యార్థులు ఆలోచనలు చేయాలని ఎపి సిఐఐ చైర్మన్ అండ్ బెటర్ క్యాస్టింగ్ సిఇఒ జె.ఎస్.ఆర్.కె ప్రసాద్ అన్నారు. ఎఐసిటిఇ, మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్త సహకారంతో వాద్వాని ఫౌండేషన్ సౌజన్యంతో చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో ఐదు రోజులపాటు నిర్వహించిన ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ బూట్ క్యాంప్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థుల జట్లకు జ్ఞాపికలు, పురస్కారపత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులను సమస్యలను సవాళ్లుగా స్వీకరించి, వినూత్న పరిష్కారాలు కనుగొనాలని అన్నారు. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఫణిరామ్ నాగరాజు, కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని, సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ఎఐసిటిఇ నుండి నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఇంజ నాగ భీమలింగేశ్వర్‌రెడ్డి, వాద్వాని ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ సుప్రభా, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

మాజీ మంత్రి దేవినేని, ఎమ్మెల్యే జూలకంటి, టిడిపి శ్రేణులు ప్రచారం

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

గుంటూరు – కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కోరారు. శుక్రవారం మాచర్ల మండలం విజయపురి సౌత్, పెదనందిపాడు, పెదకాకానిలో టిడిపి నాయకులు ప్రచారం నిర్వహించారు. మాచర్ల ప్రచారంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగుల భద్రతతో పాటు వారి భవిష్యత్ కు భరోసా కలిగిందన్నారు. కార్యక్రమంలో పంగులూరి పుల్లయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్,విజయపురిసౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి తదితరులు పాల్గొన్నారు. పెదనందిపాడు ప్రచారంలో టిడిపి నాయకులు రావి శివరామకృష్ణయ్య, నాగరాజు, కుర్ర హరబాబు తదితరులు పాల్గొన్నారు. పెదకాకానిలో టిడిపి నాయకులు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎ.ఎస్.రామకృష్ణ, వలివేటి మురళి కృష్ణ ,మన్నవ సుబ్బారావు, సుశీల రావు, తదితరులు పాల్గొన్నారు.



పెదకాకానిలో టిడిపి నేతలతో మాజీ మంత్రి దేవినేని

క్వింటాళ్ మిర్చికి రూ.20 వేల ధరివ్వాలి : సిపిఎం

(మొదటి పేజీ తరువాయి)

తగ్గిస్తామని హామీనిచ్చినవారు ఇప్పుడు ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో వినియోగదారులందరిపైనా భారాలు మోపుతున్నారని విమర్శించారు. కొత్త విద్యుత్ టారిఫ్ విధానాన్ని ప్రకటించి చిరు వ్యాపారులు, చేతి వృత్తిదారులపై కూడా అధిక భారాలు వేస్తున్నారని అన్నారు. టైం ఆఫ్ డే విధానాన్ని తెచ్చి.. విద్యుత్ ఎక్కువగా వాడే సమయంలో అధిక చార్జీలు వసూలు చేసే విధానాన్ని తీసుకువస్తున్నారని తెలిపారు. కొన్నిచోట్ల వినియోగదారుల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, వీటిని పెట్టిన చోట బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. వీటి ఏర్పాటును ఆపాలన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా, విద్యుత్ భారాలను తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు, నాయకులు కె.వెంకటశివరావు, ఎం.వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాసరావు, ఎన్.రాజేంద్ర, పి.భువనేశ్వరి, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

ప్రచారం ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరుపై ఎప్పటి కప్పుడు మండలిలోనూ, బయట పోరాటాల్లో పాల్గొన్నారు. గత ప్రభుత్వ పోలీసు నిర్బంధాన్ని అధిగమించి 2022 ఫిబ్రవరి 3న విజయవాడ బిఆర్‌టిఎస్ రోడ్డులో జరిగిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల చారిత్రాత్మక ఉద్యమంలో ఆయన నేరుగా పాల్గొన్నారు. ఎన్‌పిఎస్,సిపిఎస్, జి.పిఎస్, యుపిఎస్‌లను వ్యతిరేకిస్తూ జరిగిన ఉద్యమాల్లో పాల్గొని ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం (ఒపిఎస్) పునరుద్ధరణకు ఉద్యమించడం ఉద్యోగ వర్గాల్లో సానుకూల దృక్పథాన్ని నింపింది. మన కోసం పోరాడే వ్యక్తి లక్ష్మణరావు అనే పేరును ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, డిఎస్‌సి అభ్యర్థులలో ఏర్పడింది. ప్రధానంగా పట్టభద్రులైన నిరుద్యోగ ఉపాధ్యాయులకు డిఎస్‌సి నోటికేషన్ ఇప్పటివరకు జారీ కాకపోవడం కూడా ఆయా తరగతుల ప్రజల్లో అసంతృప్తికి దారితీసింది. జూన్ 12న సిఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సిఎం చంద్రబాబు తొలి సంతకం మెగా డిఎస్‌పిపై చేసినా ఇంత వరకు నోటిఫికేషన్ ఇవ్వలేదని వారు ఆందోళనగా ఉన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ రాలేదు. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడంలేదు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్ ద్వారా సకాలంలో వేతనాలు వస్తుంటే అప్కాస్ రద్దు చేస్తారన్న ప్రచారం టిడిపి అభ్యర్థి ఆలపాటికి ప్రతికూల అంశంగా మారుతోంది. 2020కి ముందు ఉన్న పద్ధతిలో మళ్లీ ప్రైవేటు ఏజెన్సీల ద్వారా జీతాలు ఇచ్చేపద్ధతి తెస్తారా అనే అనుమానం ఔట్ సోర్సింగ్ ఉద్యోగ వర్గాల్లో నెలకొంది. ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పిఆర్‌సి, ఐఆర్ ప్రకటనకు సంబంధించిన అంశాలపై ఇంత వరకు కదలిక లేదని ఆయా తరగతుల ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి ఫలితాలపై ప్రభావం చూపనుంది.

మాతృభాషలో విద్యాబోధనతో వ్యక్తిత్వ వికాసం

జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



దేశ భాష లందు తెలుగు లెస్స అన్న శ్రీకష్ణ దేవరాయల స్ఫూర్తితో తెలుగుబాషాభివృద్ధికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న తెలుగుతల్లి విగ్రహానికి అయన పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ దేశంలోనే అధికంగా మాట్లాడే బాషల్లో తెలుగు భాష మూడో స్థానంలో ఉందన్నారు. మరోవైపు బాషను కాపాడుకోవటంలో తెలుగు వాళ్ళు మాత్రం చాలా వెనుకపడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు బాషలోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలన్న ఆదేశాలను వాస్తవ రూపంలోకి తీసుకురావాలని అయన కూటమి ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రెల్లి నేత సోమి ఉదయ్ కుమార్ , బాలాజీ , నరసింహారావు రెల్లి , అలా కాసులు , కదిరి సంజయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని పటిష్టపరుద్దాం : వేమారెడ్డి

ప్రజాశక్తి - మంగళగిరి

పార్టీని పటిష్టం చేయాల్సిన బాధ్యత అనుబంధ సంఘాల మీద ఉందని వైఎస్ఆర్‌సిపి మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. నూతనంగా నియమితులైన పార్టీ మంగళగిరి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు శుక్ర వారం పార్టీ కార్యాలయంలో దొంతిరెడ్డి వేమరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కష్టపడి పని చేయాలని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్య మంత్రిగా కొనసాగి ఉంటే రైతు భరోసా, అమ్మఒడి, ఫీజు రీయిం బర్స్‌మెంట్ వంటి పథకాలు ఎప్పుడో వచ్చి ఉండేవన్నారు. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం వుందన్నారు. అధికారి పార్టీపై ఎనిమిది నెలల్లోనే ప్రజలనుండి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, భవిష్యత్తు మనదేనని, కలిసికట్టుగా ముందుకు కదులుతూ జగన్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రానున్న కాలంలో ప్రతి కార్యకర్తలకు పార్టీతో పాటు అధినేత అండగా ఉంటారని తెలిపారు. నూతనంగా ఎన్నికైన అనుబంధ విభాగాల అధ్యక్షులకు అభినందనలు తెలిపారు.

234 సెల్‌ఫోన్ల అందచేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పలువురు పోగొట్టుకున్న రూ.46.60 లక్షల విలువైన 234 సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. సంబంధిత ఫిర్యాదు దారులకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పి జి.వి.రమణమూర్తి అందించారు. సెల్ ఫోన్ల యొక్క వివరాలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, వెతికి ఎటువంటి రుసుము లేకుండా బాధితులకు అందిస్తున్నట్టు వివరించారు. ఎవరైనా ప్రజలు తమ మొబైల్ పోగొట్టుకున్నా లేదా దొంగిలించబడిన ఎడల వెంటనే పోలీస్ హెల్ప్లైన్ నంబర్ 8688831574 లేదా సిఈఐఆర్‌కు వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయాలని రమణమూర్తి సూచించారు. ఐటీ కోర్ సిఐ నిషార్ భాష, హెడ్ కానిస్టేబుల్ కిషోర్ గారు, కానిస్టేబుల్ శ్రీధర్, కానిస్టేబుల్ ఇమాం సాహెబ్, గౌస్ భాష,మానస, హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కరీముల్లాను అదనపు ఎస్పి అభినందించారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి. బెల్లంకొండ

బెల్లంకొండ మండల పరిధిలోని న్యూ చిట్యాల గ్రామ శివారులో పేకాట స్థావరంపై బెల్లంకొండ ఎస్ఐ ప్రవీణ్ దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తుల అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ.11200లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో బెల్లంకొండ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి బెల్లంకొండ

బెల్లంకొండ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫామ్ మీద నిద్రిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందారు. అతనికి 30-35 సంవత్సరాల మధ్య వయసు ఉంటుంది. తెలుపు రంగు పైన కాఫీ కలర్ పూలు కలిగినచొక్కా, కాఫీ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఇతని చేతికి గోరింటాకుతో పెట్టుకున్న EGOVJ MASS అని అక్షరాలు ఉన్నాయి. కుడికాలికి వేళ్ళు లేవు. మెడలో నలుపు రంగు పూసలు కలిగిన దండ ధరించి ఉన్నాడు. మృత దేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వ హాస్పిటల్ మార్చురీకి తరలిం చారు. వివరముల కొరకు నడికుడి రైల్వేపోలీసు ఎస్ఐ వి.శ్రీనివాసరావునాయక్. 9440438256, ఏఎస్ఐ వెంకట్రావు, 7780171069, ఎస్. రామరాజు రైటర్ 9949063960 నెంబర్లను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

పిఎఎస్ కళాశాలలో సర్టిఫికెట్ కోర్స్ ప్రారంభం

ప్రజాశక్తి, పెదనందిపాడు:

స్థానిక పి.ఎ.ఎస్ కళాశాలలో శుక్రవారం డిగ్రీ, ఎమ్‌సిఎ విద్యార్థులకు విజ్ఞాన్ యూనివర్సిటి, వడ్లమూడి వారు పైలెట్ ప్రాజెక్ట్‌గా ఉచితంగా "డేటా సైన్స్ యూసింగ్ పైథాన్" అనే ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్స్‌ను ప్రారంభించారు. ఈ కోర్సుకు సంబంధించి ప్రతి శుక్ర, శనివారాలలో 10 వారాల పాటు 30 క్లాసులు నిర్వహించనున్నారు. కోర్స్ పూర్తి చేసి పరీక్షలో పాస్ అయిన వారికి విజ్ఞాన్ యూని వర్సిటీ నుండి సర్టిఫికెట్ అందజేస్తారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీరరాఘవయ్య తెలిపారు. ఈ కోర్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్న విజ్ఞాన్ యూనివర్సిటి సిడిఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.వీరాంజనేయులు, అడిషనల్ డైరెక్టర్ట్ కల్పన, ట్రైనర్ కే.ప్రవీణ్‌కుమార్ విద్యార్థులకు



ప్రిన్సిపాల్‌తో విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతినిధులు

కోర్సు ఆవశ్య కతను వివరించారు. కార్యక్రమానికి సహకరించిన కోర్స్ కో-ఆర్డినేటర్ కే.ప్రతాప్ కుమార్, డా. పాతూరి శ్రీనివాస్, అధ్యాపకులు విజ్ఞాన్ యూనివర్సిటీ చైర్మన్ డా. లావు రత్తయ్య , వైస్ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకష్ణ దేవరాయలుకు కళాశాల, పాలకవర్గం తరుపున ధన్యవాద ములు తెలిపారు.

దోమల నిర్మూలనకు అవగాహన ముఖ్యం

ప్రజాశక్తి తెనాలి : స్థానిక పద్మసాలిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి, సతీష్ పాల్ రాజ్ నర్సింగ్ కళాశాల విద్యార్థినిలకు ఫ్రైడే డ్రైడేపై అవగాహన కార్యక్రమం శుక్ర వారం నిర్వహించారు.ఈ సందర్భంగా సహాయ మలే రియా అధికారి



మాట్లాడుతున్న ప్రభాకరరెడ్డి

చిరసాని ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న విద్యార్థినిలు ఫ్రైడే డ్రై డే కార్యక్రమం పై అవ గాహన పెంచుకుని, దోమలతో చేకూరే అనర్థాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికున్ గునియా, మెదడువాపు, జికా వైరస్, బోదకాలు వంటి వ్యాధులపై వివరించారు. కార్య క్రమంలో ఆరోగ్య సిబ్బంది ఎ. బాలచంద్రమౌళి, వి.పున్నా రెడ్డి, ఎస్.ఉమాకాంత్, డి. శ్రీనివాసరావు, సిహెచ్ ప్రసన్న పుష్పలత, షేక్ రషీద్, సయ్యద్ కరిముల్లా, ఎస్ శరత్ బాబు, ఆశా కార్యకర్తలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

200 నిఘా నేత్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి తాడికొండ

మండలంలోని గ్రామాలలో శాంతి భద్రతలు కాపాడడమే ధ్యేయంగా, ప్రతి గ్రామం లో నిఘా నేత్రాలు ఏర్పాటు చేసినట్లు తాడికొండ సీఐ కే. వాసు అన్నారు. ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు నిఘా నేత్రాలు ఏర్పాటు చేశా మని తెలిపారు. ప్రధాన కూడలి, గ్రామంలోకి రాక పోకలు సాగించే చోట, సమస్యాత్మక ప్రదేశాలలో 200 నిఘా నేత్రాలు ఏర్పాటు చేసి నట్లు సీఐ తెలిపారు. మండలంలోని నాయ కులు, వ్యాపారస్తులు, ప్రజల సహకా రంతో నెల రోజులలో జిల్లాలో ప్రప్రథమంగా మండలంలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేసినట్లు అన్నారు. సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.



న్యాయవాద చట్ట సవరణ బిల్లుపై లాయర్ల నిరసన

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

న్యాయవాద చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు కోర్టుల పరిధిలోని న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించి న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.అనిల్ కుమార్ మాట్లాడుతూ 1960 న్యాయవాదుల చట్ట సవరణ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టాలని చూడటాన్ని న్యాయవాదులంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనుక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బిఎల్ చిన్నయ్య, కె.వీరభాస్కరరెడ్డి, కె.వెంకటేశ్వరావు, డి.శ్రీనివాస రావు, జె.విజయ్ కుమార్, కెఎన్ హరిబాబు, సిహెచ్ హరిబాబు, ఎం.ఏడుకొండలు, షేక్ నాగుర్ పాల్గొన్నారు.



మండలిలో పిడిఎఫ్ ఉంటేనే ప్రజా సమస్యల ప్రస్తావన

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ఉద్యమ నేత, శాసన మండలిలో ప్రజల గొంతుకగా పనిచేసేత కెఎస్ లక్ష్మణరావును ఎమ్మెల్సీగా మరోసారి గెలిపించాలని సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జి.విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని నాగన్నకుంట, 6, 7 వార్డులు, సుగాలీ కాలనీ, ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం ప్రచారాన్ని కొనసాగించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ శాసనమండలి పునరుద్దరణ అనంతరం ఈ 18 ఏళ్లలో 14 ఏళ్లు ఎమ్మెల్సీగా పనిచేసిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అనేక ప్రజా సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించారని, ప్రభుత్వాలు విస్మరించిన అంశాలపై ప్రశ్నించారని చెప్పారు. పలు రంగాలకు చెందినవారు చేసే ఉద్యమాల్లోనూ ప్రత్యక్షంగా పాల్గొని మద్దతుగా నిలిచారని చెప్పారు. ఆయనకు ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎ.వీరబ్రహ్మం, డి.పుల్లారావు, డి.వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్‌వలి, కె.జగన్ మోహన్‌రావు, జె.రాజ్‌కుమార్, డి.విమల, ఆర్.పురుషోత్తం, నానియా నాయక్, హుస్సేన్, చిన్నయేసు, జి.రజిని, సాయి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కెఎస్ లక్ష్మణరావు గెలుపును కాంక్షిస్తూ నరసరావుపేట పట్టణం రామిరెడ్డిపేటలో సిఐటియు నాయకులు డి.శివకుమారి, షేక్ సిలార్‌మసూద్ ప్రచారం చేశారు. కరపత్రాలు అందిస్తూ మొదటి ప్రాధాన్యత ఓటేయాలని అభ్యర్థించారు. శాసన మండలిలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం పాలక పక్షాలపై ఒత్తిడి తెచ్చేందుకు లక్ష్మణరావును గెలిపించడం అవసరమన్నారు.



భూధార్‌తో కౌల్దార్లకు అసలుకే ఎసరు!

ప్రజాశక్తి - చిలకలూరిపేట

- భూ యజమానుల ఖాతాల్లోకే రాయితీలు, సబ్సిడీలు, పరిహారాలు
- సాగులో కీలకమైన కౌల్దార్లకు మొండిచేయే
- హామీలను విస్మరించి కొత్త సమస్యలు తెస్తున్న ప్రభుత్వం

పౌరులకు ఆధార్ మాదిరి భూ యజమానులకు భూధార్ కార్డులను జారీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అధికారులు ఇప్పటికే ఈ పనిలో నిమగ్నమయ్యారు. పొలాలున్న యజమానులకు 11 అంకెలతో ప్రత్యేక కార్డులను జారీ చేయనున్నారు. చిలకలూరిపేట మండలంలో ఇప్పటికే 2500 మందిని నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఇది కౌలురైతులకు ప్రభుత్వ రాయితీలు, ఇతర పథకాలను దూరం చేస్తుందనే విమర్శలు వస్తున్నాయి. కార్డుల జారీ ప్రక్రియ తర్వాత ప్రభుత్వాలు అందించే సబ్సిడీలు, రాయితీలు నేరుగా భూ యజమానుల ఖాతాలకు జమవుతాయని ప్రకటించారు. అలాంటప్పుడు వ్యవసాయంలో కీలకంగా వ్యవహరిస్తున్న కౌలురైతుల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు వస్తున్నాయి. సాగులో 65 శాతానికిపైగా కౌలురైతులున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇది 75-80 శాతం వరకూ ఉన్నా అత్తెసరుగానే పథకాలు అందుతున్నాయి. ఈ క్రమంలో కేంద్రం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూధార్ వల్ల కౌలురైతులకు పెట్టుబడి సాయం, రాయితీ విత్తనాలు, ఎరువులు, సబ్సిడీపై యంత్రాలు మొత్తానికే అందే అవకాశం ఉండదు. వాటికి సంబంధించి లబ్ది మొత్తం నేరుగా భూ యజమానుల ఖాతాలో జమవుతుందని ఇప్పటికే అధికారులు ప్రకటించారు.

దీనిపై కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ అరుగాలం కష్టించి, అప్పులుపాలై పంటలు పండిస్తున్నదని కౌలురైతులు కాగా వారికి ప్రభుత్వ సాయం మాత్రం దక్కడం లేదని అన్నారు. ఎన్నో పోరాటాల వల్ల వచ్చిన కౌలురైతు చట్టం-2011 వల్ల గుర్తింపు కార్డుల జారీ, రుణాల మంజూరు, ప్రభుత్వ పథకాల లబ్ధికి కౌల్దార్లకు అవకాశం ఏర్పడిందని చెప్పారు. అయితే ఈ చట్టాన్ని గత వైసిపి ప్రభుత్వం 2019లో సవరించిందని, భూయజమానులు అంగీకారంతోనే కౌల్దార్లకు గుర్తింపు కార్డులివ్వాలని నిబంధన వల్ల చాలా మంది రైతులకు కార్డులు దక్కలేదని గుర్తు చేశారు. దీనివల్ల పెట్టుబడి సాయం, విత్తనాలు, ఎరువులు, యంత్రాల సబ్సిడీకి కౌల్దార్లు దూరమయ్యారని, ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో పంట నష్టపరిహారాలూ అందలేదని గుర్తు చేశారు. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగానూ కౌల్దార్లు పోరాడిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో కౌల్దార్లకు హామీనిచ్చిందని తెలిపారు. అయితే అందుకు భిన్నంగా ఇప్పుడు కేంద్రంతో కుమ్మక్కై భూధార్ అంటూ కౌల్దార్లకు అన్యాయం చేయడానికి పూనుకుందని విమర్శిస్తున్నారు. ఇదే తరహా అభిప్రాయాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఎం.రాధాకృష్ణ సైతం వ్యక్తం చేశారు. వాస్తవసాగుదారులైన కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతోపాటు వ్యవసాయ పథకాలన్నీ వారికే దక్కేలా చూడాలన్నారు.



భూధార్ ప్రక్రియను పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి (ఫైల్)



బ్యాంకుల ప్రైవేటీకరణ వద్దని నిరసన

ప్రజాశక్తి - మాచర్ల

ప్రభుత్వరంగ బ్యాంక్‌ల ప్రవేటీకరణ ప్రక్రియను నిరసిస్తూ బ్యాంక్ ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా స్థానిక ఎస్‌బిఐ రామాటాకీసు శాఖ ఆవరణలో గురువారం ఉద్యోగులు ప్లే కార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆశోక్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకుల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, పనివత్తిడి పెరిగిందని చెప్పారు. ఉద్యోగుల నియమాకాలను సత్వరమే చేపట్టి అవసరమైన సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. వారానికి 5 రోజుల పనిదినాలు కల్పించాలని, ఎప్పటి నుండో పెండింగ్‌లో ఉన్న బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కారించాలని కోరారు. నిరసనలో స్టాఫ్ యూనియన్ శాఖ అధ్యక్షులు అమర్‌ప్రసాద్, నాయకులు పున్నారావు, రాజశేఖర్, సునీల్, అజీజ్, సుబ్బారావు, రత్నశ్రీ, నాగలక్ష్మీ, సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సునీల్ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీన పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఐదవ తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో పరీక్ష నిర్వహిస్తామని, ప్రతిభ ఆధారంగా విద్యార్థుల ఎంపిక చేస్తామని చెప్పారు. ఈనెల 24 నుండి మార్చి 31 వరకు దరఖాస్తులను www.apms.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

26న ఏలేశ్వరస్వామి గట్టుకు లాంచీలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 26న మాచర్ల మండలం అనుపు నుంచి ఏలేశ్వరస్వామి ఆలయానికి (మల్లయ్య గట్టు) ఏపీ టూరిజం ఆధ్వర్యంలో ప్రత్యేక లాంచీ సర్వీసులను నడపనున్నట్లు లాంచీ యూనిట్ మేనేజర్ వినయతుల్లా తెలిపారు. విజయపురిసౌత్‌లోని లాంచీ స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 26న అనుపు నుంచి ఉదయం 7 గంటల నుంచి 3:30 వరకు ఏలేశ్వర స్వామి గట్టుకు లాంచీ సర్వీసులు ఉంటాయన్నారు. పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150 టిక్కెట్ ధర నిర్ణయించామన్నారు. ఐదేళ్లలోపు పిల్లలను ఉచితంగా అనుమతిస్తామని చెప్పారు.

వేసవి దృష్ట్యా తాగునీటికే ప్రాధాన్యం : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా


వేసవి రానున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా నీటి పారుదల శాఖ అధికారులను చూడాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యానవన, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో నరసరావుపేట కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షించారు. తాగునీటికి తొలి ప్రాధాన్యమివ్వాలని, జిల్లాలోని ప్రధాన రెండు రిజర్వాయర్లలో కొంత నీటి కొరత ఉన్నందున సాగునీటి విడుదలకు 'వారాబందీ' అమలు చేయాలని చెప్పారు. చెరువులను పూర్తిస్థాయిలో నింపాలన్నారు. నీటిని వృథా కానివ్వొద్దని, లీకేజీలు లేకుండా చూడాలని చెప్పారు. సాగునీటి వినియోగంపై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగుచేయాలని సూచించారు. సమీక్షలో ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజినీర్ శ్యాంప్రసాద్, ఇఇలు మురళీకృష్ణ, శ్రీహరి, ప్రేమ్‌కుమార్, మురళి, ఉద్యాన వన శాఖాధికారి రామణారెడ్డి పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే

ప్రజాశక్తి-ముప్పాళ్ల


రైతుల సమక్షంలోనే రీసర్వే చేయాలని అధికారులు, సిబ్బందిని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సంబంధిత రైతుతోపాటు, చుట్టుప్రక్కల రైతులను కూడా పిలవాలన్నారు. మండలంలోని నార్నెపాడులో జరుగుతున్న భూముల రీ సర్వేను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. భూముల రికార్డులను పరిశీలించారు. సర్వే నంబర్ల ఆధారంగా రైతు వారీగా భూ విస్తీర్ణంపై ఆరా తీశారు. గ్రామంలోని భూముల వివరాలను సమగ్రంగా తమకు అందజేయాలని, రీ సర్వే ను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. వెబ్ ల్యాండ్ రికార్డుల ప్రకారం రీ సర్వే చేయాలన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రమణకాంత్‌రెడ్డి, తహశీల్దార్ భవానీ శంకర్, డిటి లక్ష్మీ ప్రసాద్, సర్వేయర్ టి.సుధాకర్, సర్వే, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




దుగ్గిరాలలో







కొల్లిపర, మంగళగిరి, చేబ్రోలులో ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు లక్ష్మణరావుకు వేయాలని కోరుతున్న ప్రజాసంఘాల నాయకులు

మన వాణి వినిపించే లక్ష్మణరావును

శాసన మండలికి పంపిద్దాం!

ప్రజాశక్తి-మంగళగిరి

కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం పాత మంగళగిరిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్య ఓటు వేసి లక్ష్మణరావును గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు. శాసనమండలిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రశ్నించే కేఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పి.బాలకృష్ణ, ఎం.చలపతిరావు, వై.కమలాకర్, ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల : మండలంలోని ఏమని, కొండూరు గ్రామాల్లో కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, బాబూరావు, వై.స్టాలిన్, న్యాయవాది వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, వి, శేషగిరి పాల్గొన్నారు.

తొమ్మిది నెలల్లో కూటమి పాలకులు ఏం చేశారనీ...

కొల్లిపర : తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, 50 సంవత్సరాలు వయస్సు కలిగిన మహిళలకు పింఛన్, జాబ్ క్యాలెండర్ అంటూ ఎన్నికల్లో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం... ఒక్క హామీ అయినా నెరవేర్చిందా? అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మొలక శివారెడ్డి ప్రశ్నించారు. కొల్లిపర గ్రామంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిది నెలల కాలంలో నమ్మి ఓట్లేసిన రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని ప్రజలను కోరారు. మన కోసం పోరాడే లక్ష్మణరావు లాంటి నాయకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సంఘం లక్ష్మణరావుకు బ్యాలెట్ పేపర్లో 23వ నంబరు కేటాయించినట్లు ఆయన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి కోట చంద్రశేఖర రావు మాట్లాడుతూ చట్టసభల్లో ప్రజల వాణి వినిపించగల లక్ష్మణరావు వంటి నాయకుడిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో శాసనమండలికి పంపించాలని విజ్ఞప్తి చేశారు.

లక్ష్మణరావు గెలుపు.. ప్రజాగెలుపు

తాడేపల్లి : లక్ష్మణరావు గెలుపు.. ప్రజా గెలుపని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఉండవల్లి, ఉండవల్లి సెంటర్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపు ఎంత అవసరమో పట్టభద్ర ఓటర్లకు తెలియజెప్పారు. మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్ రెడ్డి, మల్లెల రమేష్, జుమ్మడి కుమార్, సాంబశివరావు, సురేందర్, ఓలేటి రత్తయ్య, వల్లభాపురం వెంకటేశ్వరరావు, తక్కెళ్లపాటి భక్తిరెడ్డి, కె.రామకృష్ణ, ఆనంద్ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్ : కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ, ఎంటిఎంసీ పరిధిలోని ఇప్పటం గ్రామంలో ప్రజా సంఘాల నాయకులు విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. దాదాపు18 సంవత్సరాలుగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్స్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులు.. తదితర అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న లక్ష్మణరావును గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, డివైఎఫ్ఐ మండల నాయకులు పల్లె భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరు : ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని పెదపరిమి గ్రామంలో సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ.. ప్రజల గొంతుక కెఎస్ లక్ష్మణరావు అని తెలిపారు. ప్రజా సమ్యల పరిష్కారం కోసం నిరంతరం తన గళం వినిపించారని, నిబద్ధతతో పనిచేశారని గుర్తు చేశారు. లక్ష్మణరావు గెలుపు ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి రూరల్ : మండలంలోని నూతక్కి గ్రామంలో లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి పట్టభద్రుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వల్లూరి భారతి, ఏఐటీయూసీ మంగళగిరి మండల నాయకులు మదీనా బాబు, రైతు సంఘం నాయకులు తమ్మ సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు : పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ పట్టబద్రులకు విజ్ఞప్తి చేశారు. తెలుగపాలెం రామాలయం ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తప్పుడు ప్రచారాలతో పట్టభద్రులను మోసం చేయటానికి సిద్ధపడుతున్న అభ్యర్థులను విజ్ఞతతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సమస్యలపై మాట్లాడే శక్తి ఉన్న లక్ష్మణరావును గెలిపించుకుంటే మన తరఫున శాసనమండలిలో మాట్లాడతారని చెప్పారు. కార్యక్రమంలో భావనారాయణ, సిఐటియు మండల కార్యదర్శి రమేష్ బాబు, నాయకులు నాయక్, రాజు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిలో


బ్యాలెట్ నమూనా ఆవిష్కరణ


తాడేపల్లి : ఈ నెల 27న జరగనున్న ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బ్యాలెట్ నమూనాను కేసీ వర్క్స్ యూనియన్ కార్యాలయం వద్ద గల అంబేద్కర్ విగ్రహం ముందు నాయకులు ఆవిష్కరించారు. లక్ష్మణరావు గెలుపు కార్మిక, ఉద్యోగ, ప్రజల గెలుపుగా భావించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కె.ఆదినారాయణ, వేముల దుర్గారావు, బి.నరసింహారావు, కూరపాటి స్టీవెన్, ఎం.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడిదే విజయం కావాలి

తాడేపల్లి : కార్పొరేట్ దిగ్గజంతో తలపడుతున్న సామాన్యుడు, ప్రజల మనిషి, పిడిఎఫ్ అభ్యర్థి, కెఎస్ లక్ష్మణరావుదే విజయం కావాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్ నగర్, తెల్ల కోరి, ఎర్ర కోరి ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. కరపత్రాలతో పాటు, నమూనా బ్యాలెట్ కూడా ఆవిష్కరించారు. వేముల దుర్గారావు, వెంకన్న, రమణ, దివ్య, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఇప్పటంలో


నూతక్కి


తాడేపల్లిలో


తాడేపల్లిలో


పెదనందిపాడు సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

లక్ష్మణరావు గెలుపు చారిత్రక అవసరం

ప్రజాశక్తి - పెదనందిపాడు

ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో అన్ని ప్రజా సంఘాలూ బలపర్చిన పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతు, ప్రజా సంఘాలు బలపరిచిన లక్ష్మణరావు గెలుపు చారిత్రక అవసరమని చెప్పారు. మన ప్రాంత సమస్యలైన గుంటూరు ఛానల్ పొడిగింపు, నల్లమడ వాగు ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని జరిగిన రైతుల ఆందోళనలో ప్రత్యక్షంగా పాల్గొని, వారి సమస్యలను శాసనమండలిలో లేవనెత్తారని గుర్తు చేశారు. ఈ సమస్యలపై అనేకసార్లు ముఖ్యమంత్రులను కలిశారని, ప్రజా వేదికల మీద తమ మద్దతు తెలియజేశారని చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన అంగన్వాడీల సుదీర్ఘ సమ్మెలో మద్దతు తెలియజేసి వారి సమస్యల మీద ప్రభుత్వంతో చర్చలు జరిపారని తెలిపారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ, నిరంతరం ప్రజా సమస్యలపై స్పందించే లక్ష్మణరావు గెలుపునకు అందరూ సహకరించాలని కోరారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా లక్ష్మణరావు వ్యవహరిస్తారన్నారు. 27న జరిగే ఎన్నికలలో లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, రైతు సంఘం నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, గద్దె మల్లేశ్వరరావు, గాబ్రియేల్, ప్రజానాట్యమండలి నాయకులు దేవరకొండ శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు గారపాటి రమేష్, గుగ్గిలం సాయిబాబు, మహిళా సంఘం నాయకులు పి భువనేశ్వరి, మర్రి లక్ష్మి, షేక్ షమీ పాల్గొన్నారు.



ఎన్నికల విధులపై సంపూర్ణ అవగాహన అవసరం : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా పూర్తి చేసేందుకు ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షణ చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూక్ష్మ పరిశీలకులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నియమించిన సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వి.కరుణ, డీఆర్వో ఖాజావలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగు ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి సామగ్రిని తీసుకోవడం, కేంద్రంలో ఏర్పాట్లు, పోలింగ్ నిర్వహణ, తిరిగి పోలింగ్ సామగ్రి రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించే వరకూ అన్ని ప్రక్రియలో పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. నిర్దేశించిన ఉదయం 8 గంటలకు పోలింగ్‌ను ప్రిసైడింగ్ అధికారులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్స్‌లు సక్రమంగా సీల్ వేసి, ప్రిసైడింగ్ అధికారులు నిర్దేశించిన ఫారాలు సక్రమంగా పూర్తి చేసే ప్రక్రియలోనూ సహకారం అందించాలన్నారు. సూక్ష్మ పరిశీలకులు పర్యవేక్షించాల్సిన అంశాలను పూర్తి స్థాయిలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు.



యూటీఎఫ్ పట్టణ అధ్యక్షునిగా దాసరి

ప్రజాశక్తి-మంగళగిరి

యుటిఎఫ్ పట్టణ శాఖ సమావేశం గురువారం మంగళగిరిలో నిర్వహించారు. కె.నిర్మల అధ్యక్షతన జరిగిన సమావేశంలో పట్టణ అధ్యక్షులుగా దాసరి చిన్న అంకారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 27న జరిగే కృష్ణా- గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు విజయానికి కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు యు.రాజశేఖర్, శ్రీనివాసరావు, ఆంజనేయులు, నాయకులు టి.శ్రీనివాసరావు, టి.మోహన్ శ్రీనివాస్, ఎం.కోటిరెడ్డి, ఎస్.కె.రెహమాన్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక జేఎంజే మహిళా కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రముఖ హైదరాబాద్ సంస్థలైన హీరో మెట్రో క్రాప్, ఫాక్స్ కాన్ సంస్థలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 109 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ డాక్టర్ గాదె థెరెస్సమ్మ తెలిపారు. ఎంపికైనవారికి ఏడాదికి రూ.2.4 లక్షలు జీతభత్యాలు ఇవ్వనున్నట్లు ఆయా సంస్థల హెచ్ఆర్ మేనేజరు శివకుమార్ వెల్లడించారు. ఐఎల్ఎం బెంగళూరు సంస్థకు 27 మంది ఎంపికయ్యారు. జేఎంజే కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ షైనీ, వైస్ ప్రిన్సిపల్ శారద మేరి, ప్లేస్మెంట్ అధికారి జె.జి.సుధాకరయ్య తదితరులు పాల్గొన్నారు.





పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ నెల 27న జరగనున్న పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ నుంచి పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రజాసంఘాల నాయకులు జోరుగా ప్రచారం చేపడుతున్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని వెంగళరెడ్డి కాలనీలో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు షేక్ మస్తాన్ వలి, సయ్యద్ రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

బాసట(సామాజిక సాంస్కృతిక వేదిక) ఆధ్వర్యంలో మధుమేహం, బిపిలకు సంబంధించి ఈ నెల 23న స్థానిక పి.ఆర్.విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సీనియర్ వైద్యులు లింగమల్ల మోహన్ భాస్కర్ పాల్గొంటారు, సమీప ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంకెన్నాళ్లీ డోలీ మోతలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గిరిజన గ్రామాల ప్రజలకు రోడ్డు సౌకర్యాలు లేక.. వైద్యం అందక అనారోగ్యం బారినపడి మృతి చెందుతున్నారని.. ప్రభుత్వాల నుంచి స్పందన ఉండటం లేదని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీనునాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎన్నార్టీ సెంటర్లో ఉన్న సంఘ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం పెదరావిగూడెం పంచాయతీ బండారిగూడెంలో ముచికి దేవమ్మ అనే గిరిజన మహిళా మృతి చెందిందన్నారు. డోలి మోతలు లేని గ్రామాలను చూస్తారని చెప్పిన కూటమి ప్రభుత్వం.. దీనికి ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. గిరిజన మహిళ మృతిపై కూటమి స్పందించి, వారి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో తక్షణమే రోడ్డు సౌకర్యాలు కల్పించాలని కోరారు.

రేపు రాజుపాలెం అంకమ్మతల్లి తిరునాళ్లు

ప్రజాశక్తి - రాజుపాలెం

మండల కేంద్రంలోని గ్రామదేవత శ్రీ అంకమ్మతల్లి తిరునాళ్లను ఆదివారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లూ చేశారు. ఆ రోజున ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆదివారం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ పెద్దలు తెలిపారు.

వైసిపి మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షునిగా రెహమాన్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి పల్నాడు జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షునిగా నరసరావుపేటకు చెందిన మాజీ కౌన్సిలర్ షేక్ రెహమాన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గోపిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మున్సిపాల్టీలలో వైసిపికి చెందిన మాజీ కౌన్సిలర్లను, ప్రస్తుత కౌన్సిలర్లను సమన్వయం చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

మాతృ భాష పరిరక్షణ మనందరి బాధ్యత



ప్రజాశక్తి- మాచర్ల

భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమన్న విషయాన్ని ఐక్య రాజ్య సమితి విద్యా, విజ్ఞాన శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) చెబుతోందని... మాతృ భాష పరిరక్షణ మనందరి బాధ్యతని, తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత తొలుత మన ఇంటినుంచే మొదలు కావాలని వాసవి క్లబ్ జోన్ ఛైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు అన్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన కీర్తి పురస్కార గ్రహీత కవి, రచయిత చంద్రమౌళి రామనాథశర్మ, చరిత్ర పరిశోధకులు, రచయిత పాలువూరి సతీష్‌బాబులను సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఓరుగంటి మాట్లాడుతూ ఆంగ్లభాషపై మోజు కారణంగా తెలుగు భాష ప్రమాదంలో పడుతుందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే బోధనా మాధ్యమంగా ఆంగ్లంను పాఠశాలలలో బోధించటం ద్వారా పిల్లలు తెలుగుభాషకు దూరమవుతున్నారన్నారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ప్రాథమిక విద్య తెలుగులోనే ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బచ్చు రాజ్‌కుమార్, చుండూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేశభాషలందు తెలుగులెస్స

చిలకలూరిపేట : దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీనాథుడు, శ్రీకృష్ణదేవరాయలు పలికిన పలుకులు మన తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేస్తున్నాయని రొటేరియన్, విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పి.వి. సుబ్బారావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో శ్రీ శారద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన విద్యార్థులకు తెలుగు భాషా గొప్పదనం చెప్పారు. ప్రస్తుతం ఆంగ్ల భాషా వ్యామోహంలో మమ్మీ డాడీ కల్చర్ ప్రభావంతో తెలుగు భాష మరుగున పడిపోవడం బాధాకర మన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షులు ఆళ్ల వేమన రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రత్నజ్యోతి, తెలుగు ఉపాధ్యాయులు డాక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట : పట్టణంలోని జ్ఞానేశ్వరి అర్బన్, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాషాభిమానులు, సాహితీ వేత్త లు, రచయితలు కలసి డాక్టర్ పీవీ సుబ్బారావు, డాక్టర్ దార్ల బుజ్జిబాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ డెరైక్టర్, మాజీ ఏజీపీ దాసరి చిట్టి బాబు మాట్లాడుతూ బాల్యం నుంచే పిల్లలకు తెలుగుభాష, సంస్కృతి పట్ల ఆసక్తి కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు గేరాయాకోబు, గుంజి వీరాంజనేయులు, తుర్లపాడు మాజీ సర్పంచ్ వడ్లాన చంద్రం, జెర్రి పోతుల బుల్లిబాబు, బెజ్జం రవి, షేక్ బాజీ, బాషా, బత్తుల విక్రమ్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.





పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు : డిఇఒ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం ఇంటర్మీడియట్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లకు, డిపార్ట్మెంట్ అధికారులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కోఆర్డినేటర్ ఎన్.అక్బర్ అలీ హాజరై పలు అంశాలను వివరించారు. అనంతరం పల్నాడు జిల్లా పాఠశాల విద్యాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 3 - 15 వరకు, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయని చెప్పారు. పరీక్షలకు 2,117 మంది ఇంటర్మీడియెట్ అభ్యర్థులకు 9 పరీక్షా కేంద్రాలను పల్నాడు జిల్లాలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. 2 ఫ్లైయింగ్ స్క్వాడ్ లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



పరీక్షలకు హాజరు కాబోయే అభ్యర్థులు పరీక్ష సమయానికి అరగంట ముందుగా చేరుకోవాలని సూచించారు. కేంద్రాలను "నో ఫోన్ జోన్"గా ప్రకటించినందున విద్యార్థులు, పరీక్ష సిబ్బంది అందరూ తమవద్ద ఎటువంటి మొబైల్ ఫోన్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఉంచుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సార్వత్రిక విద్యాపీఠం సమన్వయకర్త హుస్సేన్ పాల్గొన్నారు.



ఎఐపై ఎంఎంలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కేసానుపల్లి గ్రామ పరిధిలోని ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఐబిఎం కంపెనీ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన అంశంపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంపెనీ రిసోర్స్ పర్సన్ బి.షణ్ముఖ్ పాల్గొని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా సాంకేతికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఇంజనీరింగ్ విద్యార్థులు అప్‌డేట్ కావాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు కళాశాలలో నిర్వహిస్తున్నామని కళాశాల ఛైర్మన్ మేదరమెట్ల శేషగిరిరావు తెలిపారు. ఆర్టిఫిషల్ ఇంటెలెజిన్స్ ప్రతి రంగంలో వ్యాప్తిచెందిదని.. దానికనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాదినేని రామారావు తెలిపారు. వర్క్‌షాప్ అనంతరం విద్యార్థునులుకు పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జె.రవిశంకర్ విభాగాధిపతులు నవీన్, రాధిక, సితార తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి మార్ఫింగ్ ఫొటోలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మహా కుంభమేళాలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్నానం చేసిన సమయంలోని ఫొటోలను మార్ఫింగ్ చేసి, జగనన్న సైన్యం పేరుతో సామాజిక మాధ్యమాలలో అసభ్యకరంగా పోస్టులు పెట్టడాన్ని ఖండిస్తూ.. నరసరావుపేట 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జనసేన జిల్లా కార్యదర్శి అద్దేపల్లి ఆనందబాబు శుక్రవారం ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బెల్లంకొండ అనిల్, నాయకులు గుప్తా శ్రీకాంత్, ఆర్కే యాదవ్, కృష్ణంశెట్టి గోవిందరావు, చిన్నపల్లి సాంబశివరావు, బోనం జయరాం, జానీ తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న జనసైనికులు

రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - మాచర్ల : పల్నాడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటయింపునకు పల్నాడు జిల్లా ఎం.ఎల్.ఎలు కృషి చేయాలని.. లేదంటే నైతిక బాధ్యత వహించాలని సిపిఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ కార్యాలయంలో వరికపూడిశెలకు త్వరలో ప్రకటించనున్న రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల కేటయించాలని అఖిల పక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం : కలెక్టర్

అభ్యుదయ రైతు శేషారావుకు సత్కారం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రకృతి వ్యవసాయం సాగు ద్వారా రైతులకు ఆదాయం వస్తుందని, ఆరోగ్యం కూడా ఉంటుందని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. పల్నాడు జిల్లా స్థాయిలో ప్రకృతి వ్యవసాయంలో మిరప సాగు చేస్తున్న ఉత్తమ అభ్యుదయ రైతు దర్శి శేషారావును జిల్లా ఘనంగా సన్మానించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసేవారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఏపీ సీఎన్ఎఫ్ రాష్ట్ర కార్యాలయ నుంచి జిల్లా బాధ్యులు రామచంద్రరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సక్రమమైన పద్ధతుల్లో పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. భూసారం పెరుగుతుందన్నారు. తద్వారా ప్రజల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. అందుకు ఉత్తమ ప్రకృతి అభ్యుదయ రైతు దర్శి శేషారావు నిదర్శనమన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి, జిల్లా డీపీఎం అమల కుమారి మాట్లాడుతూ అభ్యుదయ రైతు దర్శి శేషారావు ఎన్నో ప్రయోగాలు చేసి ఫలితాలు సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



రైతును సత్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి 7
గుంటూరు
శనివారం 22 ఫిబ్రవరి 2025

మరుగుదొడ్లు కనుమరుగు

ప్రజాశక్తి-తాడేపల్లి

సీతానగరం బోటు యార్డు దగ్గర గతంలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను మునిసిపల్ అధికారులు కూల్చి వేశారు. అక్కడ నివాసం ఉంటున్న పేదలు ముఖ్యంగా మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. విజన్ 2047 వైపునకు అభివృద్ధి పరుగులు పెడుతోందని చెబుతున్న ప్రభుత్వం మహిళలని 80ఏళ్లు వెనక్కి తీసుకెళ్లినట్లయింది. పురుషులకు కొద్ది మేర ఇబ్బంది లేకపోయినా, మహిళలు మాత్రం చెంబుతీసుకొని బయటకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. పేదలు నివాసం ఉంటున్న ప్రాంతంలో కాలకృత్యాలు తీర్చుకోవటానికి నానా అగచాట్లు పడుతున్నారు. కృష్ణ పుష్కరాలు సందర్భంగా సీతానగరం నది ఒడ్డున ఇల్లు తొలగించిన సమయంలో తాత్కాలిక ఉపశమనం కింద 40 గజాల స్థలం ఇక్కడ పేదలకు కేటాయించారు. మళ్లీ పుష్కరాలు రాబోతున్నాయి. సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రభుత్వం, అధికారులు చెప్పిన మాటలు నేటికీ అమలుకు నోచుకోక పోవడం బాధాకరం. చిన్నపాటి వాన వస్తే నీళ్లు నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. ఇళ్లలోకి నీళ్లు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు మరుగుదొడ్లను కూడా కూల్చి వేయ డంతో వారి అవస్థలు వర్ణనాతీతం. రోజులు గడుస్తున్నా నిర్మాణం చేపట్టక పోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. పేదల సిగ్గును కాపా డటానికి అధికారులు చొరవ తీసుకొని వెంటనే మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మరుగుదొడ్లు నిర్మిస్తాం : అనూష, ఏఈ

సామూహిక మరుగుదొడ్ల కూల్చివేతపై ఎంటీఎంసీ ఏఈ అనూషను ప్రజాశక్తి వివరణ కోరగా మరుగుదొడ్ల శిధిలావస్థకు చేరటంతో కూల్చివేయాల్సి వచ్చిందని చెప్పారు. రూ. 1.40లక్షలతో త్వరలోనే పనులు చేపట్టి పూర్తి చేస్తామనీ, అప్పటి వరకు స్థానికులు సహకరించాలని కోరారు.


కూల్చివేయక ముందు...


కూల్చివేసిన తర్వాత...


అధికారులతో మాట్లాడుతున్న ఛైర్మన్ శ్రీనివాస్‌రావు

వంద పడకల ఆసుపత్రి నిర్మాణంపై అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరిలో నిర్మించనున్న వంద పడకల ప్రభు త్వ ఆసుపత్రి నిర్మాణ పనులపై అధికారులతో ఏపీఎంఎస్ ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్‌రావు శుక్రవారం మంగళగిరి ఆటోనగర్ లోని ఏపీ ఎంఎస్ ఐడీసీ కార్యాలయంలో మంగళగిరి నియోజకవర్గం, చినకాకాని లోని యార్లగడ్డ వెంకన్న చౌదరి ఆంకాలజీ వింగ్, రీసెర్చ్‌సెంటర్ ఆవరణలో నిర్మించ నున్న వంద పడకల వైద్యశాలకు రోగి-కేంద్రీకత డిజైన్, ఇన్ఫెక్షన్ నియంత్రణ, స్థిర త్వం పలు కీలక అంశాలపై చర్చించి ఆసుపత్రి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మంగళగిరిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వందపడకల ఆసుపత్రిని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చి దిద్దాలని, ప్రతి పేదవానికి కార్పొరేట్ వైద్యం అందించే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో సంపూర్ణ వైద్యసేవలను అందించేలా మౌలిక వసతులు. సదుపాయాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడిసి సీఈ జి.సుధాకర్ రెడ్డి, ఎస్ఈ వి.చిట్టిబాబు, ఈఈ సీవీరమణ, డీఈఈ ఎమ్.హనుమంతరావు నాయక్ పాల్గొన్నారు.


దీక్షల్లో కూర్చున్న కార్మికులు

మంత్రి మాట నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ ఎన్నికల ముందు మంగళగిరి ప్రాంతంలో ప్రచార సమయంలో సిమెంట్ ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కోరారు. తమ న్యాయమైన సమస్యను పరిష్కరించమని ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 80 రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎం గురవయ్య, బి దానయ్య, ఎన్ సుబ్బారావు, ఆర్ ఇస్రాయెల్, కష్ణమాచార్యులు కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఐఎఫ్‌టియు నాయకులు కె ఆది నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్య పోరాటాల ద్వారానే సిమెంట్ ఫ్యాక్టరీ సమస్యను పరిష్కరించుకుందామని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమాదేవి, ఆరిఫ్, దుర్గ భవాని, సాల్మన్ రాజు, వేముల లక్ష్మి, రమణ, శారద, సామ్రాజ్యం, చారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి

సబ్ కలెక్టర్ సంజన సింహా



ప్రతిజ్ఞ చేయిస్తున్న జెసి సంజన సింహా

ప్రజాశక్తి తెనాలి

ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్ సంజన సింహా చెప్పారు. ఈనెల 27న జరగనున్న కృష్ణ గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటర్ అవగాహన ర్యాలీని శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి గాంధీ చౌక్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ తెనాలి అర్బన్ పరిధిలో మొత్తం 26 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఓటరు స్లిప్పులు ఇప్పటికే ఇంటింటికి తిరిగి సిబ్బంది పంచుతున్నారన్నారు. తద్వారా ఓటరు క్రమసంఖ్య పోలింగ్ బూత్ వివరాలు తెలుసుకొని సకాలంలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లా నోడల్ ఆఫీసర్ సంజీవరావు మాట్లాడుతూ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. కమిషనర్ బి శేషన్న, జిల్లా ఉపాధి కల్పనాధికారి దుర్గాబాయి ఓటర్లను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మాతృభాషాభివృద్ధితోనే మానవ మనుగడ


వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్

ప్రజాశక్తి-గుంటూరు

మాతృభాషాభివృద్ధితోనే మానవ మనుగడ సాధ్యమని అధికారభాషా సంఘం సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక హిందూ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సభ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.మల్లికార్జున ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమ్మఒడి నుంచి నేర్చుకుని అలవాటుగా మాట్లాడుతున్న భాషను ముందుగా బాగా నేర్చుకుంటే ఆ తరువాత ఏ భాష అయినా సులువుగా వస్తుందని అన్నారు. తద్వారా అన్ని ప్రాంతాలు, రంగాలలో రాణించవచ్చని వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జపాన్, రష్యా లాంటి దేశాల ప్రతినిధులు వేరే దేశాలకు వెళ్లినప్పుడు వారి మాతభాషలోనే మాట్లాడటం గమనించవచ్చని, అలా మనం కూడా మాతృభాషను ఆదరించా లన్నారు. ప్రసిద్ధ ఆక్యుపెంక్చర్ వైద్యులు డాక్టర్ మాకాల సత్యనారాయణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ అందె బాల శౌరి, అధ్యాపకులు ఇ.సుదేర్సన్, ఆలూరి నటరాజకుమారి, తపతీ కిరణ్ ప్రసంగించారు.


మాట్లాడుతున్న లక్కరాజు లక్ష్మణరావు

ప్రజాశక్తి - తెనాలి : స్థానిక నాజర్‌పేటలోని లూథరన్ ప్రాథమి కోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత మునిపల్లె వెంకట రఘునాథరావు అధ్యక్షతన జరి గిన వేడుకలలో ముఖ్య అతిథిగా కవి, రచయిత లక్కరాజు లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేమన పద్యాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్య క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుని పి.ప్రియదర్శిని, ఉపా ధ్యాయులు ఎం. వెంకటరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్‌లో మాతృభాషా దినోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-గుంటూరు

మాతృభాష మన మనసుకు బాగా దగ్గరైన భాషని, మాతృభాషని ఎవరూ మరచిపోవద్దని విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య విద్యార్థులకు తెలిపారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో మాతృభాషా దినోత్సవంలో లావు రత్తయ్య మాట్లాడుతూ మాతృభాష విద్యా రంగంలో అనేక ప్రయోజనాలను అందిస్తుందన్నారు. పిల్లల అభ్యాసం, సృజనాత్మ కత, నైపుణ్యాలు పెరిగేలా చేస్తుందన్నారు. పిల్లలు తమ మాతృభాషలో నేర్చుకున్న విషయాలను త్వరగా అర్థం చేసుకుంటారని, సృజనాత్మ కత-ఆలోచనా విధానం మెరుగవడం, కొత్త ఆలోచనలను, సమస్య పరిష్కార విధానాలను సులభంగా అభివృద్ధి చేసు కుంటారని అన్నారు. మాతృ భాషపై పట్టు ఉంటేనే ఇతర భాషలు కూడా నేర్చుకోవటం సులభం అవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలు పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, మొమెం టోలను అందజేసారు.


బసవరావును సత్కరించిన కమిటీ పెద్దలు

భావనారుషి దేవాలయాన్ని సందర్శించిన వీసీ బసవరావు

ప్రజాశక్తి - మంగళగిరి

కర్నూల్ రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ నియమితులై గురువారం బాధ్యతలు స్వీకరించిన మంగళగిరికి చెందిన ఉడతా వెంకట బసవరావు శుక్రవారం మంగళగిరిలోని నాంచారమ్మ ప్రాంగణంలోని శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామివార్ల దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం కమిటీ పెద్దలు ఉడతావెంకట బసవరావును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు జి ధనుంజయరావు, సంఘం కోశాధికారి గంజి రవీంద్రనాథ్, సహాయ కార్యదర్శి రామనాథం పూర్ణచంద్రరావు, వంగర లక్ష్మయ్య, జొన్నాదుల బిక్షరావు, బిట్రా భాస్కరరావు, చింతకింది చినవీర రాఘవులు పాల్గొన్నారు.


అద్దె నగదు కమిషనర్‌కు అందజేస్తున్న లీజుదారులు

షాపుల అద్దెలు నూరుశాతం చెల్లించండి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన షాపుల అద్దెలు మార్చి నాటికి నూరుశాతం చెల్లించాలని, బకాయిలు ఉన్న షాపులను సీజ్ చేయడానికి రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం స్థానిక లీలామహల్ ఎదురుగా ఉన్న నగర పాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపుల లీజుదారులు 2024-25 ఏడాదికి సంబంధించిన అద్దె మొత్తాన్ని కమిషనర్‌కు అందజేశారు. లీలామహల్ ఎదురుగా ఉన్న 21 షాపుల లీజుదారులు పూర్తి అద్దె రూ.10,99,245 చెల్లించారని, మిగిలిన షాపింగ్ కాంప్లెక్స్ వాళ్లు కూడా చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని చెప్పారు. సకాలంలో అద్దెలు చెల్లించని షాపులను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. సదరు కార్యక్రమంలో ఆర్.ఓ షాదిక్ బాషా, ఆర్.ఐ కాశియ్య పాల్గొన్నారు.

గ్రూప్-2లో రోస్టర్ తప్పలను సరిచేయాలని ధర్నా


ధర్నా చేస్తున్న అభ్యర్థులు

ప్రజాశక్తి-గుంటూరు

గ్రూప్-2 పరీక్షల నోటిఫికేషన్‌లో రోస్టర్ పాటించ లేదని, రోస్టర్ విధానం అమలు చేసిన తర్వాతే గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని నిరుద్యోగులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ కె.వి.సుబ్రహ్మణ్యాం మాట్లాడుతూ రాష్ట్రంలో 2023 డిసెంబర్ 7న విడుదల చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్‌లో రోస్టర్ విధానాన్ని పాటించకుండా మెయిన్స్‌కి ఎంపిక చేయటం వల్ల అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రోస్టర్ విధానం సరిగ్గా పాటించకపోతే పోస్టులు మిగిలి పోయే అవకాశం ఉందని, ఫలితంగా అర్హత కలిగిన అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా 92వేలకు పైగా ఉన్న అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అభ్యర్థులు వెంకట్, రాజు, షాహినా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం : హోం మంత్రి అనిత

ఎమ్మెల్యే అరవిందబాబు ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందజేసిన సాయిసాధన చిట్స్ బాధితులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సాయిసాధన చిట్ ఫండ్ బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిందని, త్వరలోనే బాధితులకు న్యాయం చేస్తామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. సాయి సాధన చిట్ ఫండ్ బాధితులు శుక్రవారం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో హోంమంత్రి వంగలపూడి అనితను కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సాయి సాధన చిట్ ఫండ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లారావుకు, అతని సమీప బంధువు సిఐ శివప్రసాద్ మరి కొంతమంది అధికారులు సహకరించారని బాధితులు హోంమంత్రి ఎదుట వాపోయారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన మంత్రి అనిత పుల్లారావుకు సహకరించిన పోలీసు అధికారులపైన విచారణ చేపట్టాలని గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠికి ఆదేశాలు జారిచేశారు. అగ్రిగోల్డ్ వ్యవహారంలా కాకుండా తమకు త్వరగా న్యాయం చేయాలని బాధితులు హోంమంత్రి అనితను వేడుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ కష్టపడి పనిచేసుకొని దాచుకున్న డబ్బును చిట్ ఫండ్ పేరిట మోసం చేయడం, బాధితులు మోసపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగేవరకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని బాధితులు సంయమనం పాటించాలని కోరారు. కాగా సాయి సాధన చిట్ ఫండ్ యజమాని పుల్లారావు ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. కాగా విజయలక్ష్మి టౌన్ షిప్‌లో పుల్లారావు భాగస్వామి గుండా సాంబశివరావు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఇతని పై పలు ఆర్థిక అంశాలకు సంబంధించి కేసులు నమోదయ్యాయి.


హోం మంత్రి అనితకు వినతి పత్రం ఇస్తున్న సాయిసాధన చిట్స్ బాధితులు



క్రీడాకారుల్ని పరిచయం చేసుకుంటున్న భాష్యం రామకృష్ణ, డాక్టర్ నాగార్జున

శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో రెండ్రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి సిఎల్‌పిటి మిలానోత్సవ్ 4.0 కార్యక్రమం శుక్రవారం ప్రారంభం అయ్యింది. కార్యక్రమానికి భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, గుంటూరు శ్రేష్ఠ హాస్పిటల్ డైరెక్టర్, కార్డియాలజిస్ట్ డాక్టర్ గొట్టిపాటి నాగార్జున హాజరయ్యారు. చలపతి విద్యాసంస్థల అధినేత వైవి ఆంజనేయులు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. మిలానోత్సవ్ 4.0 వంటి క్రీడా ఉత్సవాలలో పాల్గొనడం కేవలం ఒక పోటీగా కాకుండా, ఒక జీవితానుభవంగా భావించాలన్నారు. సాధన, కృషి, పట్టుదల మనం ఏదైనా గమ్యాన్ని చేరుకోవడంలో చాలా కీలకమైన అంశాలని అన్నారు. డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ క్రీడా ఉత్సవాలు కేవలం పోటీలు మాత్రమే కాకుండా, శారీరక బలాన్ని పెంచుకోవడం, ఆరోగ్యంగా ఉండడం, క్రమశిక్షణ నేర్చుకోవడం, ఇతరులతో సంబంధాలు పెంచుకోవడం, మనో బలాన్ని పెంపొందించడం వంటి లక్షణాలు అలవడతాయన్నారు. వైవి ఆంజనేయులు మాట్లాడుతూ దేశానికి అమూల్యమైన సంపద యువత అని, ఇటువంటి క్రీడా ఉత్సవాలలో విద్యార్థులు భాగస్వాములు కావడం ద్వారా జిజ్ఞాస, సమయపాలన, స్థిరత్వం వంటి ఎన్నో లక్షణాలు అభివద్ధి చెందుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు ప్రసంగించారు. మిలానోత్సవ్‌లో భాగంగా వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, క్యారమ్స్, చెస్, రన్నింగ్ వంటి 12 రంగాలలో బాల బాలికలకు పోటీలను నిర్వహించారు.

ఆర్మీ ఉద్యోగాలపై టిజెపిఎస్‌లో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న ఆర్కే అవాస్థి

మాతృదేశ సేవలో నేటి యువతకు గొప్ప ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకుని యువత ముందుకు వెళ్లాలని, మంచి వేతనంతో పాటు సమాజంలో గౌరవ భావాలు కలిగే ఉద్యోగాలు మనదేశ ఆర్మీలో ఉన్నాయని బ్రిగేడియర్ ఆర్కే అవాస్థి అన్నారు. స్థానిక టిజెపిఎస్ కాలేజిలో శుక్రవారం ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో భారతదేశ ఆర్మీలో ఉపాధి అవకాశాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల సెక్రెటరీ, కరెస్పాండెంట్ కె. వి. బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్‌సిసి వంటి వాటిల్లో తప్పనిసరిగా ప్రవేశించాలని, తద్వారా క్రమశిక్షణ, దేశభక్తి భావంతోపాటు ధైర్యం వంటి గుణాలు అలవడతాయన్నారు. అంతే కాకుండా ఉపాధి అవకాశాలు త్వరగా వస్తాయన్నారు. కార్యక్రమంలో కల్నల్ పుణీత్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, మేజర్ అమర్‌దీప్ కుమార్, మేజర్ పి.కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

రీసైక్లింగ్ పై విస్తృత పరిశోధనలు జరగాలి

ఏపీ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య

ప్రజాశక్తి - ఎఎన్‌యు



రీసైక్లింగ్‌పై విస్తృత పరిశోధనలు జరగాలని ఎపి కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డాక్టర్ పి కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, పర్యావరణ అభివృద్ధికి అవలంబించాల్సిన సుస్థిర విధానాలు అంశంపై రెండు రోజుల యుజిసి జాతీయ సదస్సు వర్సిటీ డైక్ మెన్ ఆడిటోరియంలో ప్రారంభమైంది. విసి కంచర్ల గంగాధర్ రావు అధ్యక్షతన సదస్సులో కృష్ణయ్య మాట్లాడుతు మానవ జీవన విధానంలో పర్యావరణ పరిరక్షణ అంతర్భాగం కావాలన్నారు. కాలుష్య నివారణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కోరారు. వస్తువులను పునర్ వినియోగించుకోవడం అనేది భారత జీవన విధానంగా ఉండేదని, తిరిగి దానిని మళ్లీ కొనసాగించాల్సిన ఆవశ్యకత నేడు ఎంతైనా ఉందన్నారు. విశ్వవిద్యాలయాల్లో రీసైక్లింగ్ అంశంపై విస్తత స్థాయిలో పరిశోధనలు చేపట్టాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే పర్యావరణ పాలసీలు దేశ ఆర్థిక సమాజాభివృద్ధికి దోహద పడాలన్నారు. ఆహార సంక్షోభం సమయంలో హరిత విప్లవం ద్వారా ఆహార ఉత్పత్తుల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి అన్నారు. అయితే అధిక దిగుబడులను సాధించేందుకు రసాయన ఎరువులను వినియోగించడం ద్వారా అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. విసి ఆచార్య కంచర్ల గంగాధర్ రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా సుస్థిర అభివృద్ధికి కావలసిన పలు నూతన పథకాలను ప్రవేశ పెట్టాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయాన్ని మరింతగా పెంచాలన్నారు. ఎస్ ఆర్‌ఎం యూనివర్సిటీ పర్యావరణ విభాగం డీన్ డాక్టర్ కే.రాజేంద్రన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మానవాళి ఎదుర్కొంటున్న కాలుష్య నివారణకు అనుసరిస్తున్న పద్ధతులలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ ప్రయోజనకరంగా ఉన్నాయి అన్నారు. వర్సిటీ రెక్టర్ ఆచార్య రత్న షీలామణి మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లే పర్యావరణ కాలుష్యం రోజురోజుకు పెరుగుతుందన్నారు. జాతీయ సదస్సు డైరెక్టర్ ఆచార్య పి బ్రహ్మాజీరావు సదస్సు ప్రాముఖ్యతను వివరించారు. అందులో భాగంగా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర మరియు రెండు తెలుగు రాష్ట్రాల నుండి 40 మంది పర్యావరణ నిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు హాజరై తమ పరిశోధన పత్రాలు సమర్పించారన్నారు. సదస్సులో చేపట్టిన తీర్మానాలను యూజీసీ మరియు ప్రభుత్వాలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్టర్ ఆచార్య జి సింహాచలం, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్యకే వీరయ్య, పర్యావరణ విభాగం విభాగపతి ఆచార్య ఏవీవి ఎస్ స్వామి ,మహారాష్ట్ర పెర్గో సన్ కళాశాల అధ్యాపకులు తన్వి యోగేష్ భరద్వాజ్, అమీర్ ముల్లా తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

గుంటూరులో బ్యాంకు ఉద్యోగులు నిరసన

ప్రజాశక్తి-గుంటూరు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక(యుఎఫ్‌బియు) ఇచ్చిన పిలుపుమేర గుంటూరులోని అన్ని బ్యాంకు అధికారులు, ఉద్యోగులు స్థానిక జిటి రోడ్డులోని యూనియన్ బ్యాంకు రీజనల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యుఎఫ్‌బియు కన్వీనర్ సయ్యద్ భాషా మాట్లాడుతూ న్యాయమైన బ్యాకు ఉద్యోగుల సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని, లేని ఎడల మార్చి 24, 25 తేదీలలో దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను సమ్మెతో స్తంభింపచేస్తామని హెచ్చరించారు. ఎస్‌బిఐ ఆఫీసర్స్ అసోసియేషన్ చీఫ్ రీజినల్ సెక్రటరీ జయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయాలు పక్కనపెట్టి ఉద్యోగ సంఘాలు బ్యాంకు యాజమాన్యాల చర్చల ద్వారా పరిష్కరించుకునే విషయంలో అనవసర జోక్యంతో చర్చలను పక్కత్రోవ పట్టించే చర్యలు సరికాదన్నారు. ఐబిఓసి యుబిఐ నాయకులు రాంబాబు మాట్లాడుతూ ఇటీవల కాలంలో బ్యాంకు ఉద్యోగులపై జరుగుతున్న భౌతిక దాడులలో నిందితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్‌బిఐ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కోటిరెడ్డి మాట్లాడుతూ ఎంతోకాలంగా 5రోజుల పనివిధానం, అనేక ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బ్యాంకులలో తగినన్ని ఉద్యోగ నియామకాలు జరపాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలని, 5 రోజుల పనివిధానం ప్రకటించాలని, ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవిచంద్రారెడ్డి, మురళీ సాంబశివరావు, రామక్రిష్ణ, వేణు, పావని తదితరులు పాల్గొన్నారు.

చికెన్, గుడ్డు వినియోగంపై అపోహలు వద్దు

అవగాహన సదస్సులో ప్రజాప్రతినిధులు, అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-గుంటూరు


చికెన్ తింటున్న ఎమ్మెల్యేలు, వైద్యులు, ఇతర అసోసియేషన్ ప్రతినిధులు

చికెన్, కోడిగుడ్లు వినియోగంపై గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పట్టాభిపురంలోని స్వామి థియేటర్ ప్రాంగణంలో అవగాహన సదస్సు, ఫుడ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహమ్మద్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ప్రజలందరూ ఉడికించిన చికెన్, గుడ్లను తినొచ్చని, ఉడికించిన వాటిని తినటం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని వారు తెలిపారు... ప్రజలందరూ ఎలాంటి అపోహలకూ గురికాకుండా పౌష్టికాహారం అయిన చికెన్, గుడ్డు తినాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉడికించిన చికెన్ గుడ్లను తినొచ్చని చెప్పిందన్నారు. పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ఓ.నరసింహారావు మాట్లాడుతూ 70 డిగ్రీల వద్ద వేడి చేసిన చికెన్‌లో వైరస్ ఉన్నా బతకదని, దేశంలో 100 డిగ్రీల వద్ద వేడి చేస్తామని, కావున చికెన్, గుడ్డు నిరభ్యంతరంగా తినొచ్చన్నారు. సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారం కారణంగా చికెన్, గుడ్లు వ్యాపారం దారుణంగా దెబ్బ తినడం జరిగిందని గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ప్రజలందరూ చికెను ఉడికించి తినొచ్చని చెప్పారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన చికెన్, ఎగ్ ఫుడ్ మేళాకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి చికెన్, గుడ్డుతో కూడిన బిర్యాని తిన్నారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, డాక్టర్ రాయపాటి మమత, డాక్టర్ నిమ్మల శేషయ్య, జిఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బాబు, పౌల్ట్రీ ట్రేడర్ అసోసియేషన్ అమరావతి ప్రెసిడెంట్ ఎం.కిషోర్‌బాబు, పౌల్ట్రీ ఫెడరేషన్ చైర్మన్ సురేష్, నాగేశ్వరరావు, సక్కు గ్రూప్ ప్రతినిధులు మాధవి, ధర్మతేజ పాల్గొన్నారు.